క్లుప్తంగా

ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి(జీపీడీపీ) ప్రణాళికలపై కార్యదర్శులు, సచివాలయ సాంకేతిక సహాయకులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. గత కొద్ది రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి 2024–25 ఏడాదికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. పంచాయతీల అభివృద్ధికి, గ్రామస్తుల అవసరాలకు ఉపయోగపడే పనులు గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉపాధి వేతనదారులు, గ్రీన్‌అంబాసిడర్ల వేతనాలు, పంచాయతీల్లో మౌలిక వసతుల నిర్వహణ ఖర్చులను కూడా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి


అపార్ట్‌మెంట్స్ వద్ద అగ్ని ప్రమాదాల నియంత్రణపై సూచనలు చేస్తున్న ఫైర్ ఎస్సై

పాలకొండ రూరల్: అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు అన్నారు. పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, ప్రధాన మార్కెట్, పలు అపార్ట్‌మెంట్‌ల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటిని అదుపుచేసేందుకు తమ శాఖ పనితీరుపై ప్రత్యేక డెమో నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో సమస్యలు తలెత్తితే తక్షణమే స్పందించి అధికారులకు సమాచారం అందించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టుల వద్ద అనుమానస్పద వ్యక్తుల కదలికలపై, వచ్చిపోయే వాహనాల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. శ్రీకాకుళం, సీతంపేట రహదారుల్లో, స్థానిక యాలాం కూడలి వద్ద గస్తీ నిర్వహణను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి సమయంలో వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సిబ్బంది రేడియం జాకెట్లు ధరించాలని సూచించారు. రోజువారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఆయన వెంట ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

రోగుల చెంతకే వైద్యం


తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి సాగర్ వర్మ

గరుగుబిల్లి: రోగుల చెంతకే వైద్య సేవలను అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కేకే సాగర్‌వర్మ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు తనిఖీలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పొలం పనులకు వెళ్లిన వారు 10 గంటల లోగా ఇంటికి చేరుకోవాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా మంచీనరు, పండ్ల రసాలు, ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పద్మ, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రమణమ్మ, సిబ్బంది ఉదయకుమారి, ప్రసాద్, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ఆశా కార్యకర్త చింతాడ అప్పమ్మ సేవందించారు.

కళావతికి జన నీరాజనం


గొల్లవీధి సెంటర్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్న కళావతి, పార్టీ నాయకులు

- పట్టణంలో జోరుగా ప్రచారం
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రచారం జోరుగా సాగుతోంది. పట్టణంలోని బుట్టిమఠం వీధి, గొల్లవీధి, వీవర్స్ కాలనీ, సిర్లిపోతన్నవీధి, కోరాడ వీధి, వెంకమ్మపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆమె ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటి వద్ద ఆమెకు జనం హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అందించిన పథకాలతో మేమంతా ఎంతో సంతోషంగా ఉన్నామంటూ ఎమ్మెల్యే కళావతికి దీవెనలు అందించారు. జైజగన్ నినాదాలతో పాలకొండ పట్టణం హోరెత్తింది. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, నాయకులు వెలమల మన్మథరావు, కోరాడ సూర్యనారాయణబాబు, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్ కుమార్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, కడగల రమణ, కోరాడ రవికుమార్, కిల్లారి మోహన్, నీలాపు శ్రీనివాసరావు, యందవ మరియదాస్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకంలో మేట్లకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మేట్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వేతనదారుకు గరిష్ఠంగా రూ.300లు పెంచడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో ముందస్తుగా కొలతలను ఇవ్వాలని, వేతనదారుల మస్తర్లను ఎన్ఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. ఎండతీవ్రత పెరిగిన నేపథ్యంలో వేతనదారులు ఉదయం 6గంటల నుంచి 10.30 గంటల వరకు మధ్యాహ్నం 4గంటల నుంచి 6 గంటల వరకు పనుల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గౌరీనాథ్, టీఏలు భూలక్ష్మి, ఉమా మహేశ్వరీ, వివిధ గ్రామాల క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన ఆర్వో


స్ట్రాంగ్‌రూం భద్రతపై అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్వో కల్పనాకుమారి

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలో భాగంగా పాలకొండలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలను రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం పరిశీలించారు. పాలకొండ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు తీసుకొచ్చి పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో వాటిని భద్రపరిచారు. ఈ ప్రక్రియను ఆర్వో స్వయంగా పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ఠ భద్రత కల్పించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావుకు సూచించారు. ఈ పరిసరాల్లోకి ఇతరులను అనుమతించొద్దన్నారు. ఆమె వెంట పాలకొండ, సీతంపేట ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులు పి.వరహాలు, ఉమామహేశ్వరరావు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్, తదితరులున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


కురుపాం: గౌడువీధి నుంచి నూకాలమ్మ గుడికి ఘటాలతో వెళ్తున్న మహిళలు


గరుగుబిల్లి: కొత్తూరులోని రామమందిరం

గరుగుబిల్లి: శ్రీరామ నవమి ఉత్సవాలకు రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారి దర్శనానికి, కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. బుధవారం వేకువజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తోటపల్లిలోని కోదండరామాలయంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఈఓ సూర్యనారాయణ, ఆలయ కమిటీ మెంబర్లు ఏర్పాట్లు చేశారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.500లు చెల్లించి తమ గోత్ర నామాలతో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

● గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలోని కోదండరామ మందిరంలో బుధవారం నుంచి పంచమ రాత్రుల జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వారాల పండగ

కురుపాం: మండల కేంద్రంలోని గౌడువీధిలో మంగళవారం గ్రామదేవత వారాల పండగను ఘనంగా నిర్వహించారు. నూకాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు భక్తులు చెప్పారు.

సర్వమంగళ దేవికి ప్రత్యేక పూజలు


భామిని:పూజలు నిర్వహిస్తున్న తెలుగు-ఒడియా భక్తులు

భామిని: ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో వెలసిన సర్వమంగళ దేవీ సన్నిధిలో చైత్ర మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బత్తిలి, సింగుబాయి, కాత్రగడకు చెందిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామానికి చెంది ఓ వ్యక్తి కళ్లికోట గ్రామంలో సారా అమ్ముతుండగా మంగళవారం అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. అతని వద్ద 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నగదు తరలింపుపై నిఘా పెంచాలి: ఆర్వో


మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల నియమావళిలో భాగంగా స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏలో స్టాటిక్ సర్వలెన్స్ బృందాలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు, రూ.10 వేలు కంటే ఎక్కువ విలువగల వస్తువులు తీసుకువెళ్లే వారి వద్ద సంబంధిత పత్రాలు ఉంటేనే విడిచిపెట్టాలని, లేదంటే నిబంధనల ప్రకారం వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. సరిహద్దు చెక్ పోస్టులలో మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణాపై నిఘా పెంచాలని సూచించారు. ప్రతీ రోజు తనిఖీలు నిర్వహించి ఆర్వో కార్యాలయానికి నివేదికలు పంపించాలన్నారు. సమావేశంలో ఎస్సై జగదీష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచడమే శ్లాష్ లక్ష్యం

- డీఈఓ పగడాలమ్మ


వందవ హైస్కూల్ జరుగుతున్న శ్లాష్ పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

వీరఘట్టం: తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చడమే 'శ్లాష్' లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. వీరఘట్టం మండలంలోని పలు పాఠశాలలో 4వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై మంగళవారం స్టేట్ లెవెల్ ఎఛీవ్‌మెంట్ సర్వే(శ్లాష్) పరీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణను ఆమె పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంఈఓ ఆర్.ఆనందరావు ఉన్నారు. అంతకుముందు రేగులపాడు కేజీబీవీని డీఈఓ సందర్శించారు.

పెదపెంకిలో కందుకూరి వీరేశలింగం జయంతి

బలిజిపేట: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమాన్ని పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుకవి వీరేశలింగం తెలుగువారి గొప్పతనాన్ని చాటిచెప్పారని సంజీవనాయుడు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఎం.చిన్నంనాయుడు, పి.రాము, పి.శ్రీను, ఎస్.జగదీష్, జి.శ్రావణ్ పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: చంద్రబాబు మోసపూరిత హామీలు, మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని పరుశురాంపురం, గుణానపురం, ఆర్తాం గ్రామల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి స్థానిక నాయకులు, గ్రామస్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధిని వివరించారు. పార్టీలకు అతీతరంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించామన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయలేదని గుర్తుచేశారు. మాట ఇవ్వడం మరచిపోవడం చంద్రబాబుకు అలవాటని, ఇచ్చిన మాట ఇస్తే కచ్చితంగా అమలు చేయడం జగనన్న నైజమని అన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రజలకు అందజేశారన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ జిల్లాలో రబ్బరు డ్యాం ఏర్పాటు చేసి ప్రతీ ఎకరాకు సాగునీరు అందించారని, వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రతీ ఇంటికి తాగునీరు అందించే బాధ్యత తనదని అన్నారు. జగనన్న అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తనూజరాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ డి.జనార్దనరావు, నాయకలు కళింగి మల్లేశ్వరావు, శెట్టి మధుసూదనరావు, కొమరాడ,శివిని పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, చింతడ అప్పలనాయుడు, మజ్జి తవిటినాయుడు, పైల వెంకటరమణ, పలువురు నాయకలు, కార్యకర్తలు పాల్గున్నారు.

మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి

- డీఎంఓ జగన్మోహనరావు


మణిగలో దోమతెరల వాడకంపై అవగాహన కల్పిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో మలేరియా తీవ్రత పెరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు సూచించారు. మండలంలోని గిరిశిఖర గ్రామం మణిగలో మంగళవారం ఆయన పర్యటించారు. మలేరియా జ్వరాల వ్యాప్తిపై ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి మలేరియా నివారణ చర్యలు, దోమతెరల వాడకంపై అవగాహన కల్పించారు. సరిహద్దు ఒడిశా గ్రామాలకు పనులకు వెళ్లి వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం భామిని, బత్తిలి పీహెచ్‌సీలను సందర్శించి అక్కడి ల్యాబ్‌లను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణపై ఆరాతీశారు. ఆయన వెంట ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర, డాక్టర్ సోయల్, డాక్టర్ దామోదరరావు, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి: ఎస్పీ

- పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన


గరుగుబిల్లి: రావివలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

గరుగుబిల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలంతా సహకరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. మండలంలోని రావివలస పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై వై.అమ్మన్నరావు ఉన్నారు.

● జియ్యమ్మవలస: చినమేరంగి సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోలింగ్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆరాతీశారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఐ మంగరాజుకు సూచించారు. సెన్సిటివ్ గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎస్సైలు పి.అనీష్, ఇ.చిన్నంనాయుడు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


కరపత్రం ఆవిష్కరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎక్కడైన ప్రమాదాలు సంభవిస్తే 08941-260111కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అగ్నమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం పంచాయతీ మాజీ సర్పంచ్ అధికారి కాశీనాయుడుతో పాటు మరో 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా గ్రామనికి ప్రతీ ఎకరానికి సాగునీరు అందుతోంది, పంటలు బాగా పండుతున్నాయి. దీనంతటికీ కారణం మహానేత వైఎస్సార్. ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమంతో మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం. అందుకే మేమంతా ఆయన వెంట నడిచేందుకు సిద్ధమయ్యామని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, కళింగి మల్లేశ్వరరావు, శెట్టి మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, స్థానిక నాయకలు చింతడ అప్పలనాయుడు, మజ్జి తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

నిన్నటివరకు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలు. పింఛన్లను, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకు చేర్చే సేవకులు. నేడు వారంతా జగనన్న సైనికులుగా మారేందుకు సిద్ధమయ్యారు. ప్రతిపక్షాలు తమపై చేస్తున్న అసత్య ఆరోపణలకు నిరసనగా వలంటీర్ ఉద్యోగాలకు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సుమారు 200 మందికిపైగా వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓలకు, ఆయా సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కొమరాడ: కెమిశీలలో రాజీనామా ప్రతాలు కార్యదర్శికి అందజేస్తున్న గ్రామ వలంటీర్లు


గుమ్మలక్ష్మీపురం: రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ జగదీష్ కుమార్‌కు అందజేస్తున్న రెల్ల సచివాలయ వలంటీర్లు


గరుగుబిల్లి: రాజీనామా చేసిన నాగూరు వలంటీర్లు


పాలకొండ రూరల్: ఎంపీడీఈఓకు రాజీనామా పత్రాలు అందిస్తున్న గొట్టమంగళాపురం వలంటీర్లు


సీతంపేట: రాజీనామా పత్రాలు చూపిస్తున్న దేవనాపురం వలంటీర్లు


వీరఘట్టం: రాజీనామా పత్రాలు చూపిస్తున్న వీరఘట్టం గ్రామ వలంటీర్లు